





మొదటి బహుమతికి ఎంపికైన ముగ్గు





మొదటి బహుమతి పొందిన సూర్య లక్ష్మీదేవి

రంగవల్లుల జాతర

- రంగవల్లులతో.. సంక్రాంతి శోభ
- పోటీలకు ఉత్సాహంగా తరలివచ్చిన వైనం
- అట్టహాసంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీలు
- నంద్యాలలో స్ఫూర్తిదాయకంగా సాగిన పోటీలు

పుడమితల్లి ముత్యాల ముగ్గులతో మురిసింది. రంగు రంగుల ముగ్గులు వేసేందుకు మహిళలు ఉత్సాహంగా పాల్గొనడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో సంక్రాంతి ముందే వచ్చిందా అనేలా సందడి నెలకొంది. మహిళలు తీర్చిదిద్దిన ముగ్గులతో రంగుల హరివిల్లు రూపుదిద్దుకొంది. నంద్యాల పట్టణంలోని కాదర్‌బాద్ నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో జరిగిన పోటీలకు మహిళలు ఉత్సాహంగా తరలివచ్చారు. మహిళలు వేసిన రంగుల ముగ్గులు కనువిందు చేశాయి.

నంద్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని కాదర్‌బాద్‌నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన' వేడుకగా జరిగాయి. ఈ పోటీలకు స్థానికంగా అభిరుచి సేవా సమితి ఫౌండర్ అభిరుచి మధు, ప్రముఖ కంటివైద్య నిపుణులు డాక్టర్ విజయ్ భాస్కర్‌రెడ్డి, యూరాలజిస్ట్ డాక్టర్ బార్గవర్ధన్ రెడ్డి సహకారం అందించారు. ఈ సందర్భంగా విజేతలకు వారు బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో మొత్తం 80 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ ముగ్గుల పోటీలకు ప్రత్యేక అతిథిగా నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి విచ్చేసి ముగ్గులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు చక్కగా ముగ్గులు వేస్తూ, తెలుగు సంప్రదాయాలను పరిరక్షిస్తున్నారన్నారు. ముగ్గు అనేది సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమని, అలాంటి దానిని ఒక తరం నుంచి మరో తరానికి అందజేస్తూ వారధిగా నిలుస్తున్నారన్నారు. అభిరుచి మధు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అనగానే నంద్యాలలోని ప్రతి ఇంటి ముందు రంగురంగుల హరివిల్లులు విరుస్తాయని, ప్రతి వీధి కళకళలాడుతుందన్నారు. మహిళల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



అనంతరం న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు అభిరుచి సేవా సమితి అధ్యక్షులు బహుమతి ప్రధానోత్సవం చేశారు. మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతిగా రూ.6,000, రూ.4,000, రూ.3,000, అలాగే పదిమంది ప్రోత్సాహక బహుమతులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి నంద్యాల జిల్లా ఇన్‌చార్జి మురళీమోహన్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి పాత్రికేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొదటి స్థానంలో నిలవడం ఆనందంగా ఉంది

మాది ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం క్రిష్ణంశెట్టి పల్లె. ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. కనుమరుగవుతున్న సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడేందుకు ఏబీఎన్-ఆంధ్రజ్యోతి క్రమం తప్పకుండా ప్రతి ఏటా ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండటం ఎంతో అభినందనీయం.

- సూర్యలక్ష్మీదేవి, ప్రథమ విజేత

సంప్రదాయానికి ప్రతీక ముగ్గు

ముగ్గులు వేయడమంటే ఎంతో ఇష్టం. చిన్నప్పటి నుంచి అలవాటుగా మారింది. నేను సొంతంగా ముగ్గురు వేయడం నేర్చుకున్నాను. భవిష్యత్తులో సంస్కృతి, సాంప్రదాయాలకు విలువనిస్తూ ఇలాంటి పోటీల్లో ముగ్గులు వేయడానికి తప్పకుండా వెళ్తాను. రాష్ట్ర వ్యాప్తంగా ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహిస్తుండటం మాకు స్ఫూర్తిని కలిగిస్తోంది.

- ఎం.పద్మ, ద్వితీయ విజేత



ఉత్సాహంగా ముగ్గులు వేశాం

ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు ఉత్సాహంగా వచ్చా. మూడోస్థానంలో నిలిచినందుకు ఆనందంగా ఉంది. భవిష్యత్తులో జరిగే పోటీల్లో మొదటి స్థానంలో నిలిచేందుకు మంచి ముగ్గులు వేసి ప్రయత్నిస్తా. ఏబీఎన్ -ఆంధ్రజ్యోతి కృషికి అభినందనలు.

- సరిత తృతీయ విజేత









రెండో బహుమతికి ఎంపికైన ముగ్గు





మూడో బహుమతికి ఎంపికైన ముగ్గు

నన్నేం చేయలేరు..

- వీఆర్‌కు వెళ్లినా కుర్చీ వదలని సీఐ
- కక్కలేక.. మింగలేక ఇబ్బందిపడుతున్న కొత్త సీఐ
- బదిలీ యత్నాల్లో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

నంద్యాల క్రైం, జనవరి 7 :

ఆయన్ను వీఆర్‌కు పంపించేశారు. అయినా ఇక్కడ పెత్తనం సాగుతూనే ఉంది. అదే అందరూ ఆశ్చర్యపోతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఏమీ చేయలేక చోద్యం చూస్తున్నారు. సదరు సీఐకి ఇంత బలం ఎట్లా వచ్చింది? నేను మోనార్క్‌నని ఎట్లా విర్రవీగుతున్నాడు? అనేవి అంతు చిక్కడం లేదు. ఉమ్మడి జిల్లా అంతా తన ఉప్పిట్లో ఉందని, పై స్థాయిలో తిరుగులేని పలుకుబడి ఉన్నదని ఆయన ప్రచారం చేసుకుంటున్నారు. కొత్తగా జాయిన్ అయిన సీఐని కూడా కంట్రోల్ చేస్తున్నాడని వినికిడి. ఆదివారం టౌన్ సర్కిల్‌లో రోల్‌కాల్, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ కూడా వీఆర్‌కు వెళ్లిన సీఐ ఇవ్వడంతో పోలీస్‌శాఖ నోరెళ్లబెట్టింది. ఈయన జోలికి వెళ్లేందుకు స్థానిక ఉన్నతాధికారులు కూడా జంకుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కొత్తగా వచ్చిన సీఐ ఈ గొడవ తనకెందుకులే అనుకొని మిన్నకున్నట్లు సమాచారం.



నంద్యాల టౌన్ సర్కిల్‌లో సీఐని వీఆర్‌కు పంపించారు. అయినా ఆయన సర్కిల్‌లోనే తిష్ట వేసి స్టేషన్ వ్యవహారాలన్నీ చక్కబెడుతున్నట్లు తెలుస్తోంది. సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడం దగ్గరి నుంచి అన్నిట్లో తలదూర్చి రాత్రి 9 గంటల దాకా ప్రైవేట్ పంచాయతీలన్నీ చక్కబెడుతున్నాడనే ఆరోపణలున్నాయి. బాధితులు ఉన్నతాధికారులను ఆశ్రయించినా పెద్దగా స్పందన లేనట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా వీఆర్‌కు వెళ్లిన సదరు సీఐ ఆదివారం రోల్‌కాల్ కూడా తీసుకున్నట్లు తెలిసింది. స్టేషన్‌లో కొత్తగా చార్జి తీసుకున్న సీఐని కాదని ఆయన రోల్ కాల్ తీసుకోవడం ఎలా సాధ్యమని పోలీస్ వర్గాలే చెవులుకొరుక్కుంటున్నాయి. సర్కిల్ పరిపాలనా వ్యవహారంలో ఒకట్రెండు సార్లు నూతన సీఐతో ఆయన స్వల్పవాదనకు కూడా దిగినట్లు సమాచారం. అవసరమైతే తాను ఆర్డర్ మెమో తెచ్చుకుంటానని సిబ్బందితో చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. దీన్నిబట్టి ఆయనకు పోలీసు శాఖలో ఎంత పట్టు ఉన్నదో అర్థం చేసుకోవచ్చని కొందరు పోలీసులు పేర్కొంటున్నారు.

అవాక్కయిన ప్రజాప్రతినిధి

సర్కిల్ పరిధిలోని ఓ పాఠశాల స్థలం విషయంలో జోక్యం చేసుకున్న వీఆర్ సీఐ తనను ఆశ్రయించిన వారికి అనుకూలంగా వ్యవహరించడం వివాదాస్పదంగా మారింది. అవతలి వర్గం వారు స్థానిక ప్రజాప్రతినిధికి ఈ విషయం విన్నవించగా ఆయన నూతనంగా కొత్తగా జాయిన్ అయిన సీఐని ఈ ఉదంతంపై ఆరా తీశారు. అయితే అందులో జోక్యం చేసుకున్నది తాను కాదని.. వీఆర్‌కు వెళ్లిన సీఐ ఈ తతంగమంతా నడిపారని బదులిచ్చినట్లు తెలిసింది. ఆ సీఐ వీఆర్‌కు వెళ్లారు కదా..? ఆయన ఎలా జోక్యం చేసుకుంటారు..? మీరు పోస్టులో ఉండి ఏం ప్రయోజనం అని ప్రజా ప్రతినిధి అన్నట్లు సమాచారం. దీనికి ఆయన తానేమీ చేయలేనని సంజాయిషీ ఇచ్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారాన్ని ప్రజాప్రతినిధి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వీఆర్‌కు వెళ్లిన వారు పెండింగ్ అంశాలను క్లియర్ చేసుకునేందుకు కొంత సమయం ఇవ్వడం ఆనవాయితీ అని, మీరు చెప్పిన విషయాన్ని పరిశీలిస్తామని చెప్పడంతో ప్రజాప్రతినిధి కూడా అవాక్కయినట్లు తెలిసింది.

బదిలీ యత్నాల్లో ఎస్సైలు

వీఆర్‌కు వెళ్లిన సీఐ పోరు భరించలేక ఆ సర్కిల్‌లో పనిచేస్తున్న ఎస్సైలు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి విషయంలో వీఆర్ సీఐ జోక్యాన్ని భరించలేకపోతున్నామని, ఎలాగైనా తమ మొర ఆలకించి బదిలీ చేయించాలని స్థానిక ప్రజాప్రతినిధులను ఆశ్రయించినట్లు సమాచారం. సదరు సీఐ వీఆర్‌కు వెళ్లాడు కదా.. మీకేం ఇబ్బంది రాకుండా చూసుకుంటాంలే అని వారు అన్నట్లు తెలిసింది. వీఆర్‌కు వెళ్లినా ఆర్డర్ మెమో తెచ్చుకుని తన పనులన్నీ చక్కబెట్టుకుంటానని చెబుతున్నాడని.. ఆయనతో వేగలేమని, బదిలీ చేస్తే అదే పదివేలని మొరపెట్టుకున్నట్లు పోలీసు శాకలో కొందరు పేర్కొంటున్నారు. అయితే సదరు సీఐపై చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు సుముఖంగా లేనట్లు తెలుస్తోంది.



ప్రాణాలు పోయినా పర్వాలేదు..



ఆదివారం రాత్రి రిలే దీక్షల్లో పాల్గొన్న అంగన్‌వాడీలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 7: తమ ప్రాణాలుపోయినా పర్వాలేదని, మోసం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీలు అమలు చేసేంత వరకు పోరాడతామని అంగన్‌వాడీలు భీష్మించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న వైఖరిని నిరసిస్తూ నిరవధిక సమ్మెలో భాగంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కూడా అంగన్‌వాడీలు శిబిరంలోనే బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల మాట్లాడుతూ బ్రిటీష్ సామ్రాజ్యంపై స్వాతంత్ర్య సమరయోధులు పోరాటాలు చేసి స్వాతంత్ర్యం పొందినట్లే అంగన్‌వాడీలు కూడా వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేసి న్యాయమైన డిమాండ్లను సాధించుకుంటారన్నారు. ప్రభుత్వం దిగివచ్చి పరిష్కరించాలని, లేదా ఆ ప్రభుత్వాన్ని సాగనంపుతామని హెచ్చరించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా అబ్దుల్ వహీద్

రాష్ట్ర కార్యదర్శులుగా తులసిరెడ్డి, నరసింహారావు, ఫణిరాజ్

నంద్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యవర్గానికి నంద్యాల జిల్లాకు చెందిన అబ్దుల్ వహీద్, తులసిరెడ్డి, నరసింహారావు, ఫణిరాజ్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి సూచనల మేరకు రాష్ట్రంలోని ఆయా నియోజవర్గాలకు చెందిన వారిని రాష్ట్ర కార్యవర్గంలోకి తీసుకున్నామని అందులో భాగంగా నంద్యాలకు చెందిన అబ్దుల్ వహీద్‌ను పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా, ఇదే నియోజకవర్గానికి చెందిన తులసిరెడ్డి, ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన నరసింహారావు, డోన్ నియోజకవర్గానికి చెందిన ఫణిరాజ్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమిస్తున్నట్లు ప్రకటన ద్వారా తెలిపారు. గత ఏడాది టీడీపీ నంద్యాలలో ఏర్పాటు చేసిన సభ సమయంలో చంద్రబాబు సమక్షంలో అబ్దుల్ వహీద్ పార్టీ కండువా కప్పుకోగా, అదే రోజు బనగానపల్లెలో నరసింహారావు పార్టీలో చేరారు. అంతకు కొన్ని నెలల ముందు తులసిరెడ్డి టీడీపీలో చేరారు. ఇక ఫణిరాజ్ మొదటి నుంచి టీడీపీతో కొనసాగుతున్నారు. నంద్యాలలో వారికి ఉన్న పట్టును గమనించిన చంద్రబాబు వారికి సరైన ప్రాధ్యాన్యాన్ని ఇస్తూ పదవులు కట్టబెట్టారు. చంద్రబాబు ఆళ్లగడ్డ పర్యటనకు రెండ్రోజుల ముందు ఈ నిర్ణయం వెలువడటంతో వహీద్, తులసిరెడ్డి, నరసింహారావు, ఫణిరాజ్ అనుయాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్మా ప్రయోగంపై విమర్శల వెల్లువ



ఎస్టీటీఎఫ్ ప్రాంతీయ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల టౌన్, జనవరి 7: అంగన్‌వాడీ వర్కర్లు 27 రోజులుగా చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని అణచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ తీరును ఖండిస్తూ వెంటనే ఎస్మా ఉత్తర్వులు రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఎం.సీ.నరసింహులు, కె.నాగేంద్రప్ప ప్రకటన విడుదల చేశారు. సుప్రీం కోర్టు తీర్పు అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వేయడమే అని పేర్కొన్నారు. చాలీ చాలని జీతాలతో ఊడిగం చేస్తున్న అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని, చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించాలే తప్ప ఎస్మా అంటూ వారిని భయభ్రాంతులకు గురి చేయ్యడం సరికాదని హితవు పలికారు.

షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ ఖండన

ఆత్మకూరురూరల్, జనవరి 7: అంగన్‌వాడీ వర్కర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు షెడ్యూల్డ్ ట్రైబ్స్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్, కుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు జవహర్‌నాయక్ పేర్కొన్నారు ఎంపీడీవో సమావేశ భవనంలో ఎస్టీటీఎఫ్ ప్రాంతీయ సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీలను ప్రభుత్వం చర్చలకు పిలిచి వారి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని నిర్బంధ చట్టాలు పరిష్కారం కాదని అన్నారు. రాష్ట్ర నాయకులు ధరణి కుపేంద్ర,మత్స్యానాయక్, వెంకటరాముడు, జిల్లా నాయకులు నాగరాజు,రాము, కేశాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 7: స్థానిక పద్మావతినగర్‌లో ఉన్న డిస్ట్రిక్స్ స్పోర్ట్స్ అథారిటీ క్రీడా మైదానంలో జనవరి 9 మంగళవారం జూనియర్స్ కబడ్డీ (కర్నూలు, నంద్యాల) ఉమ్మడి జిల్లా బాల, బాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.ఓబులేరెడ్డి, జిల్లా కార్యదర్శి ఏపీరెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కబడ్డీ పోటీలకు ఫిబ్రవరి 5వ తేదీ 2004 తరువాత జన్మించిన వారు అర్హులని అన్నారు. బాలురు 70 కేజీల బరువు, బాలికలు 61 కేజీల బరువు అర్హతగా నిర్ణయించబడుతుందని తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల జట్టు నంద్యాలలో జరిగే 49వ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

నంద్యాల (కల్చరల్), జనవరి 7: ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 8న కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ డాక్టర్ మనజిర్ జిలానీ సమూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించే స్పందనకు సోమవారం ఉదయం 9.30 గంటలకంతా జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల,నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యధాతధంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక

నంద్యాల క్రైం, జనవరి 7 : పట్టణంలోని గుడ్‌షెపర్డ్ పాఠశాల క్రీడామైదానంలో ఆదివారం నంద్యాల జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు జిల్లా హ్యాండ్ బాల్ సంఘం ఆధ్వర్యంలో జరిగాయి. పోటీలను ఉపాధ్యాయ సంఘం నాయకుడు ఏపీరెడ్డి, హెచ్ఎం మోహన్‌రెడ్డి, ఎంఈవో రమణారెడ్డి, జాకీర్ ప్రారంభించారు. ఏపీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి క్రీడల్లో పాల్గొనడం ద్వారా మేధస్సుకు పదునుపెట్టినవారవుతారని పేర్కొన్నారు. డోన్, చాగలమర్రి, కొలిమిగుండ్ల, నంద్యాల తదితర ప్రాంతాలనుంచి వచ్చిన క్రీడాకారులకు పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో 30మంది, బాలుర విభాగంలో 40మంది పాల్గొన్నట్లు ఆ సంఘం ప్రతినిధులు మహబూబ్‌బాషా, రామేశ్వరరెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గుడ్‌షెపర్డ్ స్కూల్ పీడీ బాబు, వ్యాయామ ఉపాధ్యాయులు బాష, హరి, షేక్షా, దస్తగిరి, వెంకటనరేంద్ర, జానీ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు బుద్ధి ప్రసాదించాలని..

- మున్సిపల్ కార్మికుల సర్వ మత ప్రార్థనలు
- 13వ రోజుకు చేరుకున్న నిరవధిక సమ్మె



నంద్యాలలో సర్వమత ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నంద్యాల టౌన్, జనవరి 7: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బుద్ధి ప్రసాదించాలనే కోరుతూ మున్సిపల్ కార్మికులు సర్వమత ప్రార్థనలు చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె 13వ రోజుకు చేరింది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో మొదట సర్వమత ప్రార్థనలు చేసిన అనంతరం రిలేనిరాహార దీక్షను నిర్వహించారు. సీఐటీయు నాయకులు లక్ష్మణ్, మహమ్మద్ గౌస్, మున్సిపల్ కార్మికుల సంఘం నాయకులు భాస్కరాచారిల ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతాల ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల జీతాలు పెంచాలని, కుటుంబాలను ఆదుకోవాలని, గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా దేవుళ్లు మంచి బుద్ధి ప్రసాదించాలని అన్నారు. గత రెండు వారాలుగా వివిధ రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఆందోళనలు చేస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం ఏమాత్రం చలించకపోవడం దుర్మార్గమని అన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు నిరవధిక సమ్మెను విరమించేది లేదని, రానున్న రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే మున్సిపల్ కార్మికులకు వైసీపీ ప్రభుత్వం చెవిలో పువ్వులు పెట్టిందంటూ ఏఐటీయుసీ ఆధ్వర్యంలో మరో దీక్షా శిబిరంలో కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఏఐటీయుసీ నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు, రంజిత్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక నిరాహారదీక్షల్లో భాగంగా కార్మికులు ప్రార్థనలు చేస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు రజాక్, రామ్‌నాయక్, రణధీర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు నాగన్న, గొడుగు రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తిమ్మయ్య, నాగన్న, మోహన్, సురేష్, దానమయ్య, రవి, రూతమ్మ, జీవరత్నమ్మ, మణెమ్మ, సుగుణమ్మ, సుశీలమ్మ తదితరులు ఉన్నారు.

నందికొట్కూరు రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట 13 వరోజు మున్సిపల్ వర్కర్ల సమ్మె కొనసాగింది. వివిధ మత ప్రార్థనలు నిర్వహించి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు పరమేష్, భాస్కర్ సీఐటీయూ నాయకులు గోపాల క్రిష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేశ్వరావు మాట్లాడారు. కార్యక్రమంలో అబ్రహాం, నాగన్న . భాస్కర్, సుందర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.







ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విజేతలకు బహుమతులను అందజేస్తున్న ముఖ్య అతిథి అభిరుచి మధు, నిర్వాహకులు

రంగవల్లులతో సంక్రాంతి శోభ

- నంద్యాలలో మురిపించిన ముత్యాల ముగ్గులు..
- అట్టహాసంగా ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు
- రంగురంగుల ముగ్గులను వేసిన మహిళలు

నంద్యాల కల్చరల్, జనవరి 7: తెలుగు లోగిళ్లలో సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా చేసుకునే అచ్చ తెలుగు పండుగ సంక్రాంతి. ఈ పండుగను పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నంద్యాల కాదర్‌బాద్‌నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం ముగ్గుల పోటీలు ఘనంగా జరిగాయి. 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన' వేడుకగా జరిగాయి. అభిరుచి సేవాసమితి ఫౌండర్ అభిరుచి మధు, డాక్టర్ విజయ్ భాస్కర్‌రెడ్డి (కంటి వైద్య నిపుణుడు, నయన ఐ కేర్), డాక్టర్ భార్గవర్ధన్‌రెడ్డి, యూరాలజిస్ట్ (శ్రీ సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్) బహుమతులకు సహకారం అందించారు. ముత్యాల ముగ్గుల పోటీలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ మురిపించాయి. కాదర్‌బాద్‌నరసింగరావు మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ ఆవరణంలో ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన పోటీలు ఒంటి గంట వరకు జరిగాయి. రెండు గంటల వ్యవధిలో మహిళలు రంగువల్లులను అందంగా, చుక్కలతో తీర్చిదిద్దారు. చుక్కలతో, సహజ సిద్ధంగా, సంస్కృతికి అద్దం పడుతూ ముగ్గులను తీర్చిదిద్దారు. ఉదయం నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే వచ్చి తమ తమకు కేటాయించిన స్థలాల్లో పేడతో అలికి సిద్ధం చేసుకున్నారు. ఇళ్ల దగ్గరి నుంచే రంగులను ముగ్గులకు సిద్ధం చేసుకొని వచ్చారు. మరి కొందరు మహిళలు గొబ్బెమ్మలు, రకరకాల రంగుల్లో ఉన్న పూలను, చెరకు గడలను, నవధాన్యాలను వెంట తెచ్చుకొని తాము వేసిన ముగ్గులను మరింత అందంగా తీర్చిదిద్దారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ మహేశ్వరరెడ్డి, అభిరుచి మధు హాజరయ్యారు. విజేతలకు నగదు బహుమతులు, మరో పది ఉత్తమ ముగ్గులు వేసిన మహిళలకు కన్సోలేషన్ బహుమతులు, పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా ముత్యాల ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా రాష్ట్ర అవార్డు గ్రహీత రిటైర్డు డ్రాయింగ్ మాస్టర్ చిత్తలూరి రాంప్రసాద్, రిటైర్డు ఎండిఓ విజయలక్ష్మీ, ఆర్టిస్టు పోసా శ్రీనివాసులు, ఆర్ఎస్ఎస్ వాసవీమాతపీఠం నిర్వాహకులు అపర్ణదీపిక వ్యవహరించారు.







ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి, మొదటి స్థానంలో నిలిచిన ముగ్గు, పోటీలకు హాజరైన పట్టణ ప్రజలు

పల్లెల్లో అభివృద్ధి శూన్యం : ఫరూక్





యాళ్లూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎన్ఎండీ ఫరూక్, ఆత్మకూరులో మాజీ ఎమ్మెల్యే బుడ్డాకు సమస్యలు విన్నవిస్తున్న మహిళ

గోస్పాడు, జనవరి 7: రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి అడుగడుగునా పడకేసిందని, తాము చేసిన అభివృద్ధి ఇదీ అని చెప్పుకోలేని దుస్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం యాళ్లూరు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు గంగుల వెంకటరెడ్డి, శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మంచాల విష్ణువర్ధన్‌రెడ్డి, బత్తుల జగదీశ్వరరెడ్డి, నంద్యాల హరినాథ్‌రెడ్డి, వెంకటచంద్రారెడ్డి, కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి, గోపాలకృష్ణ, బీవీనగర్ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఒక్కచాన్స్ పేరుతో నమ్మిమోసపోయాం'

ఆత్మకూరు : 'గత ఎన్నికల్లో ఒక్కఛాన్స్ పేరుతో నమ్మిమోసపోయాం.. నాలుగున్నర ఏళ్లుగా మమ్మల్ని పట్టించుకునే నాథుడే లేరు' అంటూ ఆత్మకూరు పట్టణంలోని ఖుబ్రా మసీదు ఏరియాకు చెందిన మహిళలు శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాబు షూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆయన కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. తమ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ, తాగునీటి కుళాయిలు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేవని స్థానికులు సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. ఆత్మకూరు పట్టణ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా గత టీడీపీ పాలనలో అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. మళ్లీ అధికారంలోకి వస్తే.. ఆత్మకూరు పట్టణ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, అడ్వకేట్ గిరిరాజు, కలిముల్లా, రామ్మూర్తి, ఆర్టీసీ రామకృష్ణ, నబిరసూల్, మురళీ, ముత్తు, స్టికర్ నూర్, సుబ్బరాజు, రఫీక్, న్యామత్, పెద్దన్న, తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి : మండలంలోని కపిలేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామాల్లో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, క్లస్టర్ ఇన్‌చార్జి లింగస్వామి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటి ప్రచారం నిర్వహించారు. నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, సీలం లింగన్న, జానాల సుధాకర్, డీలర్ వెంకటస్వామి, బోయ పెద్ద నరసింహ, ఆనంద్, నరసింహగౌడు, తెలుగు శివ, నాగిరెడ్డి, మధు,బాలబాబు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కాపాడుకునేందుకే రా.. కదలిరా..


ఆత్మకూరు, జనవరి 7: జగన్మోహన్‌రెడ్డి నియంత పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా రా.. కదలిరా.. సభలను నిర్వహిస్తున్నామని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగున్నర ఏళ్ల పాటు ప్రతిపక్షాలు, ప్రజలను భయపెట్టే ప్రయత్నాలు చేస్తూ పాలన సాగించారని, జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజల్లో చైతన్యం మొదలైందని అన్నారు. ఈ నెల 9వ తేదీన ఆళ్లగడ్డలో జరిగే రా..కదలిరా.. కార్యక్రమానికి టీడీపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గం టీడీపీ పరిశీలకులు వక్కలగడ్డ మల్లికార్జున, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్, స్థానిక నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, కంచర్ల గోవిందరెడ్డి, సురేష్‌రెడ్డి, నరసింహారెడ్డి, ఉల్లిమధు, అబ్దుల్లాపురం బాష, గిరిరాజు, వెంకటేశ్వర్లు, రాజారెడ్డి తదితరులు ఉన్నారు. అలాగే 9న జరిగే సభ విజయవంతానికై అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గం టీడీపీ ఇన్‌చార్జి ఉమా మహేశ్వరనాయుడు ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

పాణ్యం : స్థానిక టీడీపి కార్యాలయంలో 9వ తేదీ జరిగే బహిరంగసభ విజయవంతం చేయాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పాణ్యం మండల పరిశీలకులు జంబాపురం రమణారెడ్డి పార్టీ నాయకులకు సూచించారు. నాయకులు జయరామిరెడ్డి, రాంమోహన్‌నాయుడు, మనోహర్, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

మహానంది : ఆళ్లగడ్డలో జరిగే రా కదలి రా తెలుగుదేశం పిలుస్తోంది కార్యక్రమ విజయవంతాన్ని కోరుతూ మహానందిలో టీడీపీ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజక వర్గ టీడీపీ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి నాయకులకు పలు సూచనలు చేశారు. మండల టీడీపీ పరిశీలకులు ఏవీఆర్ ప్రసాద్ మహానంది స్థానం మాజీ ఛైర్మన్ పాణ్యం ప్రసాదరావు, మండల అధ్యక్షుడు ఉల్లిమధు, నంద్యాల పార్లమెంట్ టీడీపీ యువత కార్యదర్శి క్రాంతికుమార్, నాయకులు జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల వైద్యుడికి జాతీయ పురస్కారం

- తొలి తెలుగు వైద్యుడు కావడం విశేషం



డాక్టర్ మధుసూదన్‌రావును సన్మానిస్తున్న వైద్యుల సంఘం ప్రతినిధులు

నంద్యాల టౌన్, జనవరి 7: నంద్యాలకు చెందిన ప్రముఖ చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణుడు డాక్టర్ చిత్తలూరి మధుసూదనరావుకు జాతీయ స్థాయి జీవన సాఫల్య పురస్కారం (లైఫ్ టైం ఆచీవ్‌మెంట్ పురస్కారం)ను భారతదేశ చెవి, ముక్కు, గొంతు వైద్యుల సంఘం అందజేసింది. ఆదివారం బెంగుళూరులో దేశం నలుమూలల నుంచి వచ్చిన మూడు వేల మంది వైద్యుల సమక్షంలో, నాలుగు రోజులుగా జరుగుతున్న 75వ జాతీయ చెవి, ముక్కు, గొంతు వైద్యుల సదస్సులో బంగారు పతకం, అవార్డు సైటేషన్ (పురస్కార ప్రశంసా పత్రం) ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకర్ మెడికేరి, కార్యదర్శి డాక్టర్ కౌశల్‌షేత్, బెంగుళూరు జయదేవ హార్ట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మంజునాథ్, సదస్సు నిర్వాహక ఛైర్మన్ డాక్టర్ విజయేంద్ర, నిర్వాహక కార్యదర్శి డాక్టర్ సునీల్ నారాయణ దత్ ఈ పురస్కారాన్ని డాక్టర్ మధుసూదన్‌రావుకు అందజేశారు. మూడు దశాబ్దాలకుపైగా ప్రతి ఏటా పేదలకు ఉచిత శస్త్ర చికిత్సల నిర్వహణతో పాటు, పేద విద్యార్థులకు వడ్డీ రహిత రుణాల పంపిణీ, హిందూ స్మశాన వాటికల అభివృద్ధి, కళాక్రీడల అభివృద్ధి కోసం చేసిన కృషికి ఈ పురస్కారం అందిస్తున్నామని ప్రశంసాపత్రంలో పేర్కొన్నారు. ఈ జాతీయ అత్యున్నత పురస్కారం తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తి అందుకోవడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా డాక్టర్ మధుసూదన్‌రావుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుల ఫోరం ఛైర్మన్ డాక్టర్ జి.రవికృష్ణ, ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్, రామకృష్ణా విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, గురురాఘవేంద్ర విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ పి. దస్తగిరిరెడ్డి తదితర ప్రముఖులతో పాటు కళారాధన, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిక



మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన మహిళలు

నందికొట్కూరు రూరల్ జనవరి 7 : నందికొట్కూరు పట్టణానికి చెందిన పలువురు మహిళలు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. పట్టణ టీడీపీ మహిళా నాయకురాలు మీనాక్షీదేవి ఆధ్వర్యంలో వీరంతా టీడీపీ కండువాకప్పుకొన్నారు. టీడీపీలో చేరిన మహిళలు సుజాత, ప్రవల్లిక, ఫాతిమాబీ, ఆశ, రెజీనా, మాలతీ, సరోజ, అనిత, అనురాధ, సిద్ధయ్య, మధు, మౌలాలీ, అబ్దుల్ నబీ, శుభాన్‌ఆలీ తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాగశేషులు, ముర్తుజావలి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నేటి పోలీస్ స్పందన కార్యక్రమం రద్దు

నంద్యాల క్రైం, జనవరి 7 : సోమవారం నిర్వహించాల్సిన పోలీస్ స్పందన కార్యక్రమాన్ని అనివార్య కారణాలవల్ల తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయప్రయాసలకోర్చి జిల్లా కేంద్రానికి రావద్దని ఆయన సూచించారు. వచ్చే సోమవారం నుంచి యథావిధిగా పోలీస్ స్పందన కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉంటుందని పేర్కొన్నారు. నంద్యాల జిల్లా బొమ్మలసత్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమం మాత్రమే రద్దయిందని తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, అన్ని సర్కిల్ కార్యాలయాలు, డీఎస్పీ కార్యాలయాల్లో నేడు పోలీసు స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ పేర్కొన్నారు.

పీఎం లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్ల పరిశీలన

పగిడ్యాల, జనవరి 7: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పగిడ్యాల ఆదర్శ పాఠశాలలో సోమవారం నిర్వహించనున్న పీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమ ఏర్పాటను కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటి సెక్రటరి లలిత్ కుమార్ ఆదివారం పరిశీలించారు. డీపీవో మంజులవాణి, గృహనిర్మాణ శాఖ పీడీ వెంకటసుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల స్థాయి అధికారులు అక్కడే ఉండి కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన స్టాల్స్, స్టేజీ నిర్మాణం, ఎల్ఈడీ స్కీన్ తదితర ఏర్పాట్లు చేస్తున్నారు.


ప్రధానితో సయ్యద్ ఖాజా మొహిద్దిన్ ముఖాముఖి

నంద్యాల రూరల్, జనవరి 7 : భారత ప్రధాని నరేంద్ర మోదీ నంద్యాల జిల్లా పగిడ్యాల మండలానికి చెందిన సయ్యద్ ఖాజా మొహిద్దిన్ అనే లబ్ధిదారునితో ముఖా ముఖిగా చర్చిస్తారు. నాబార్డ్ సహకారంతో వ్యవసాయ మౌలిక సదుపాయాల ఫండ్ కింద సొసైటీ లబ్ధిదారునిగా ప్రధాని ముఖాముఖి కార్యక్రమానికి ఎంపికయ్యారు.

దాసు మృతి టీడీపీకి తీరని లోటు

కొత్తపల్లి, జనవరి 7: కొక్కెరంచ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తిరుపాటి దాసు (45) మృతి పార్టీకి తీరని లోటు అని నియోజకవర్గ మాజీ టీడీపీ నాయకులు బండి జయరాజు, మండల కన్వీనర్ నారపురెడ్డి అన్నారు. అనారోగ్యంతో కోలుకోలేక కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో శనివారం మృతి చెందిన దాసు భౌతికకాయాన్ని ఆయన స్వగ్రామమైన కొక్కెరంచ గ్రామంలో వారు సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

27వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె



పాములపాడులో సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ వర్కర్ల 27వ రోజు ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో వినూత్న రీతిలో నిరసనలు తెలిపారు. 'ఒక్కసారి అవకాశం ఇవ్వండని కోరితే నమ్మించి జగన్‌ను అందలమెక్కించాం.. ఇప్పుడు మా చెప్పుతో మేమే కొట్టుకుంటున్నాం' అంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట చెప్పులతో కొట్టుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. నందికొట్కూరు పొట్టిశ్రీరాములు సెంటర్లో ఎస్మా చట్టం జీఓ ప్రతులను దగ్ధం చేసి ఆగ్రహం ప్రకటించారు. ఆత్మకూరులో ఒంటికాళ్లపై నిలబడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. - ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


కర్నూలులో ద్వితీయ బహుమతి సాధించిన ముగ్గు వేసిన ఆర్.గౌతమి


తృతీయ బహుమతి సాధించిన ప్రసన్నకుమారి

విజేతలు వీరే...

కెనరా బ్యాంక్ - ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు.. బెంగుళూరు, రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన, హైదరాబాదు' సారథ్యంలో కర్నూలులోని టీజీవీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ జూనియర్ చైర్మన్ టీజీ భరత్ సౌజన్యంతో, మాంటిస్సోరి విద్యాసంస్థల సహకారంతో నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో ప్రథమ నగదు బహుమతి ఎస్.రాజేశ్వరి దక్కించుకోగా ద్వితీయ బహుమతి ఆర్.గౌతమి, తృతీయ బహుమతిని ప్రసన్నకుమారి దక్కించుకున్నారు. ఆదేవిధంగా నగరానికి చెందిన సుజాత, ఎం.ఉమాదేవి, జానకి, ఎస్.రేవతి, సరస్వతి, శ్రీదేవి, ఎం.ఇందిర, శ్రీలక్ష్మి, సుమలత, ఎం.రేణుకలు ప్రశంసాత్మక బహుమతులను అందుకున్నారు.



కర్నూలులో ముగ్గు వేస్తున్న యువతి




ముగ్గుల పోటీలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ




టీజీ భరత్‌కు జ్ఞాపిక బహూకరణ


ఆదోనిలో ద్వితీయ బహుమతి సాధించిన పల్లవి




ఆదోని ముగ్గుల పోటీల్లో తృతీయ బహుమతి సాధించిన వి.రూపా


విజేతకు బహుమతి, నగదుప్రోత్సాహకాన్ని అందజేస్తున్న టీజీ భరత్


కర్నూలు జిల్లా కేంద్రంలో జరిగిన పోటీల్లో కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న మహిళలు


ఆదోని ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన రాధికకు నగదు బహుమతి ఇస్తున్న బత్తిన లక్ష్మీనారాయణ

మాజీ నక్సలైట్ హత్య

- డాగ్ స్క్వాడ్‌తో పోలీసు విచారణ
- హత్యకు గురైన రాము ఎమ్మెల్సీ పోతుల సునీత సోదరుడు


పూజారి రాము (ఫైల్)

తుగ్గలి, జనవరి 7: చెట్టుకింద నిద్రిస్తున్న మాజీ నక్సలైట్ పూజారి రాము అలియాస్ భీమన్న (57)ను గుర్తు తెలియని వ్యక్తులు తలపై బండరాయితో మోది హత్య చేశారు. శనివారం రాత్రి పెండేకల్ ఆర్ఎస్ రైల్వే స్టేషన్ ఆవరణలోని వేపచెట్టు కింద నిద్రిస్తున్న పూజారి రాముపై దాడి జరగడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. రాము తన తండ్రి పెద్ద ఈశ్వరయ్య ప్రభావంతో చిన్నతనంలో పీపుల్స్‌వార్ పార్టీ మహానంది దళంలో చేరాడు. 1991లో పోలీసులకు సరెండర్ అయ్యారు. ఆ తర్వాత ఆరోగ్యం దెబ్బతినింది. 1996 నుంచి మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతూ ఉండేవాడు. ఎలాంటి వివాదాస్పద సంఘటనలో పాల్గొనని గ్రామస్తులు అంటున్నారు. తుగ్గలి ఎస్ఐ మల్లికార్జున డాగ్‌స్క్వాడ్‌తో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. గత ఆరు నెలల క్రితం ఇదే రైల్వేస్టేషన్ ఆవరణలోని దస్తగిరి కట్ట వద్ద గుర్తు తెలియని వ్యక్తిని ఇట్లాగే తలపై రాయి వేసి హత్య చేశారు. రాము ఎమ్మెల్సీ పోతుల సునీతకు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు లెనిన్‌బాబుకు సోదరుడు. ఎమ్మెల్సీ పోతుల సునీత, పోతుల సురేష్ పెండేకల్ ఆర్ఎస్‌కు చేరుకుని దహన సంస్కారాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుండగులను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.


ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణను అడ్డుకోవడం అన్యాయం

మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: అనంతపురం ఆర్ట్స్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అడ్డుకోవడం తగదని, ఇది రెడ్డి కులస్థులందరినీ అవమానించినట్లేనని రాయలసీమ స్టీరింగ్ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక బైరెడ్డి కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం అనంతపురంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తుంటే.. ముఖ్యమంత్రి ఆదేశాలతో పోలీసులు అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న రెడ్ల కులస్థుందరినీ అవమానించడమే అన్నారు. ఈ నెల 10, 11 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రెడ్ల సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ సంఘటనపై భవిష్యత్ ప్రణాళికను రూపొందిస్తామన్నారు.

ఘనంగా చెకుముకి సంబరాలు


బహుమతులు అందజేస్తున్న జేవీవీ నాయకులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 7: స్థానిక సిల్వర్‌జూబ్లీ కళాశాలలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముఖి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, ప్రముఖ అష్టావధాని రచయిత బి. హర్ష హాజరయ్యారు. వారు మాట్లాడుతూ సైన్సును బాలబాలికల్లో ప్రచారం చేయాలన్నారు. ప్రతి పనిలోనూ సైన్స్ ఇమిడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్ రాజు, జిల్లా కార్యదర్శి ఖాజా హుశేన్, వెంకటరెడ్డి, విజయకుమార్, రమాదేవి, రమేష్, తారక్ పాల్గొన్నారు.

పదిలంగా స్వర్ణోత్సవ జ్ఞాపకం

- స్థూపాన్ని ఆవిష్కరించిన కళాశాల ప్రిన్సిపాల్
- సావనీర్‌ను విడుదల చేసిన అధ్యాపకులు
- హాజరైన నాటి గురువులు, విద్యార్థులు


స్వర్ణోత్సవ స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ వీరేశప్ప

పత్తికొండ, జనవరి 7 : స్వర్ణోత్సవ సంబరాలను పదిలపరిచేందుకు పత్తికొండ జూనియర్ కళాశాలలో పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన స్థూపాన్ని ప్రిన్సిపాల్ వీరేశప్ప ఆవిష్కరించారు. పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో ఆదివారం స్వర్ణోత్సవ స్మారకస్థూపం, సావనీర్ ఆవిష్కరణ కార్యక్రమాలను డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆనాటి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. కళాశాల స్వర్ణోత్సవ సంబరాలను చరిత్రలో పదిలపరచడానికి పూర్వ విద్యార్థులు కలసికట్టుగా ముందుకు రావడం, స్థూపాన్ని, సావనీర్‌ను ఆవిష్కరింపచేయడం అభినందనీయం అన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు కళాశాలతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. హాజరైన గురువులకు, కార్యక్రమం కోసం పనిచేసిన పూర్వ విద్యార్థులకు మెమెంటోలు ఇచ్చి సత్కరించారు.


హాజరైన పూర్వవిద్యార్థులు

అందరి సహకారంతోనే చేయగలిగాం

కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు చేయాలనుకున్నాక సీనియర్, జూనియర్ బ్యాచ్‌ల నుండి వివరాలు సేకరించి వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశాం. ఇది అందరూ తమ బాధ్యత అనుకోవడం వల్ల చరిత్రలో నిలిచిపోయేలా కార్యక్రమం నిర్వహించడలిగాం. ఈ మొత్తం కార్యక్రమానికి గుర్తుగా స్థూపాన్ని ఆవిష్కరించి జ్ఞాపకాలను పదిలపరచడం ఆనందంగా ఉంది. మా కళాశాల ప్రస్థానాన్ని అందరికీ తెలియచేయడానికి సావనీర్‌ను తీసుకొచ్చాం.

- డాక్టర్ రామారావు, కార్యక్రమ నిర్వాహకులు

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

- పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి గౌరుచరితమ్మ
- పాలకొలనులో వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ నాయకులు టీడీపీలో చేరిక
- అర్ధరాత్రి షామియానాలను తొలగించిన అధికారులు

ఓర్వకల్లు, జనవరి 6 : టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరితమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పాలకొలను గ్రామంలో 500 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరితమ్మ, టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాలకొలను గ్రామానికి చెందిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ముఖ్య అనుచరులు చదువుల సుధాకర్ రెడ్డి, ఆయన సతీమణి గ్రామ సర్పంచ్ సుజాతమ్మ, చింతలపల్లె సర్పంచ్ వెంకటరమణ, కొమరోలు ఎంపీపీ శేషమ్మలతో మరో 500 మంది వైసీపీ కార్యకర్తలకు టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు నాయకులకు మేళతాళాలతో ఘనంగా గ్రామస్థులు స్వాగతం పలికారు. గ్రామమంతా పసుపుమయం జెండాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా గౌరు చరితమ్మ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఆరు మినీ మేనిఫెస్టో పథకాలను ప్రవేశ పెట్టిందని, అధికారంలోకి రాగానే పథకాలను అమలు చేస్తామన్నారు. గౌరు వెంకటరెడ్డి మాట్లాడుతూ తమకు కుటుంబ సభ్యులు ముఖ్యం కాదని, పార్టీ నాయకులు, కార్యకర్తలే ముఖ్యమని అన్నారు. బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో ఓర్వకల్లులో ఇండస్ట్రియల్ హబ్‌గా తీర్చిదిద్దిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ మండలంలో భూకబ్జాలు, మట్టి మాఫియా జరుగుతోందని, అవినీతికి మారుపేరుగా వైసీపీ నాయకులు చెలరేగిపోతున్నారని అన్నారు. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భూకబ్జాలకు ఎమ్మెల్యే కాటసాని సహకరిస్తున్నారని, ఆయన అరాచకాలను అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు పార్వతమ్మ, కర్నూలు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన సర్పంచులు, ఎంపీటీసీ నాయకులు

రాజకీయ ఒత్తిళ్లతో షామియానాల తొలగింపు

గ్రామంలో వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరుతున్న నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున అధికారులు, పోలీసులు గ్రామానికి వెళ్లి సచివాలయం ప్రాంగణంలో వేసిన షామియానాలను తొలగించడంతో గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రీశైలంలో రూ. 1.04 లక్షలు చోరీ

శ్రీశైలం, జనవరి 7: శ్రీశైల దేవస్థానం పరిధిలోని సిద్ధరామప్ప వాణిజ్య సముదాయంలోని ఓ దుకాణంలో శనివారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. సిద్ధరామప్ప షాపింగ్ కాంప్లెక్స్‌లోని జి12 దుకాణంలో రూ. 1.04 లక్షల నగదుతో పాటు సీసీ కెమెరా డీవీఆర్, హార్డ్ డిస్కులను చోరీ చేశారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ గంగయ్యయాదవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నందవరం, జనవరి 7: మండలంలోని నదికైరవాడి గ్రామంలో విద్యుదాఘాతంతో ఆదివారం షఫీ(24) అనే వ్యక్తి మృతి చెందాడు.నదికైరవాడి గ్రామానికి చెందిన షఫీ ఉదయం పూట కొళాయి మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురయ్యాడు. బంధువులు వెంటనే ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మృతుడికి భార్య గౌసియా, కుమారుడు ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

గోనెగండ్ల, జనవరి 7: గోనెగండ్ల మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందని వడ్డె వెంకటరాముడు(42) ప్రమాదవశాత్తు పాడుబడ్డ బావిలో పడి మృతి చెందాడు. గ్రామానికి చెందిన వడ్డె వెంకటరామడు అలియాస్ గణపతి ఆదివారం గ్రామ శివార్లలో ఉన్న పాడుబడ్డ బావిలో చేపలు పట్టేందుకు కుమారుడు ఉరుకుందుతో కలసి వెళ్లాడు. ఈత రాని వెంకటరాముడు బావిలో వల వేసిన సమయంలో ఫిట్స్ రావడంతో బావిలో పడిపోయాడు. ఇది గమనించిన కుమారుడు ఉరుకుంద గ్రామస్థులను పిలుచుకొని వచ్చాడు. అప్పటికే వెంకటరాముడు నీటిలో మునిగి పోయాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలం చేరుకొని నీటిని మోటర్లతో తోడిపోసి వెంకటరాముడి శవాన్ని బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటన దారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు. మేనేజర్ - ఏడివిటి

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

● డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

డోన్, జనవరి 7: టీడీపీ అధికారంలోకి వస్తేనే ఉద్యోగావకాశాలు వస్తాయని, చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కొండపేటలో వైసీపీ నాయకులు హనుమంతరెడ్డితో పాటు రాముడు, సుధీర్, ధనుంజయరెడ్డి, ఖాజా, ప్రసాద్ మరో 200 మంది వైసీపీ కార్యకర్తలు ధర్మవరం సుబ్బారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ అవినీతి అరాచక విధానాలు నచ్చకనే డోన్ నియోజకవర్గంలో టీడీపీలో చేరుతున్నారన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు సీఎం శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, లక్ష్మీనారాయణ యాదవ్, ప్రజా వైద్యశాల మల్లికార్జున, అభిరెడ్డిపల్లె గోవిందు, ఆలా మల్లికార్జున రెడ్డి, మధుసూదన్‌గౌడు, ఎస్ఎండీ రఫీ, కుమ్మరి సుధాకర్, చక్రపాణిగౌడు, మనోహర్ పాల్గొన్నారు.

'చంద్రబాబు సభను విజయవంతం చేద్దాం'

ఆళ్లగడ్డలో మంగళవారం జరిగే టీడీపీ అధినేత చంద్రబాబు రా.. కదలిరా సభను విజయవంతం చేద్దామని ఆ పార్టీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కాటమయ్య, మాజీ ఎంపీపీ ఆర్‌ఈ రాఘవేంద్ర, సీఎం శ్రీనివాసులు, శ్రీనివాసులు యాదవ్, ఎల్లనాగయ్య, గండికోట రామసుబ్బయ్య, ప్రజావైద్యశాల మల్లికార్జున, సుంకయ్య, సుదర్శన్, షేక్షావలి చౌదరి, ఉన్నం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'టీడీపీకి ఆదరణ పెరుగుతోంది'

ఆళ్లగడ్డ, జనవరి 7: ప్రజల్లో టీడీపీ ఆదరణ పెరుగుతోందని మాజీ మంత్రి అఖిలప్రియ అన్నారు. ఆదివారం పట్టణంలోని యాదవుల పేటలో బండారు శివ ఆధ్వర్యంలో 30 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేశారు. ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భార్గవ్‌రామ్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత'



మాట్లాడుతున్న టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా

చాగలమర్రి, జనవరి 7: వైసీపీపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ ప్రభుత్వం రావడం తథ్యమని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. ఆదివారం చాగలమర్రి గ్రామంలో ఆయన మాట్లాడుతూ 9న ఆళ్లగడ్డకు చంద్రబాబు వస్తుండటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు తరలిరావాలని కోరారు. టీడీపీతోనే మైనార్టీల సంక్షేమం సాధ్యమన్నారు. టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌళాలి, అబ్దుల్‌ఖాదర్, జెట్టి నాగరాజు, గఫార్, కొలిమి సోను, మాబుషరీఫ్ పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

బనగానపల్లె, జనవరి 7: మండలంలోని నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో ఈడిగ శేఖర్‌గౌడ్ అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన మహిళపై అత్యాచారయత్నం చేశాడు. ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి ఆదివారం తెలిపిన వివరాలివీ.. ఈ నెల 4న మహిళ ఇంట్లో నిద్రిస్తుండగా ఆమె ఇంట్లోకి చొరబడి బలత్కారం చేయబోగా ఆమె కేకలు వేశారు. దీంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు శేఖర్‌గౌడ్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

'పేదల కడుపు కొడుతున్న వైసీపీ'



సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్న నాగేశ్వరరావుయాదవ్

ప్యాపిలి, జనవరి 7: టీడీపీ పాలనలో పేదలకు ఇచ్చే పండుగ కానుకలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి కడుపు కొడుతోందని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై.నాగేశ్వరరావుయాదవ్ విమర్శించారు. చంద్రపల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం 600 మంది పేద లకు సంక్రాంతి కానుకలను అందజేశారు. నాయకులు వై.లక్ష్మీనారాయణ యాదవ్, చల్లా అనుదీప్, ఆదినారాయణ, రామకృష్ణ, పుల్లయ్య, సందీప్ పాల్గొన్నారు.

● ఈ నెల 9న ఆళ్లగడ్డలో టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించే రా..కదిలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి అధ్యక్షుడు నాగేశ్వరరావు యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు చిన్నసుంకయ్య, రామ్మోహన్‌యాదవ్, చల్లా వీరాంజినేయులు, ప్రసాద్‌రెడ్డి, మధుకుమార్, సుదర్శన్, ఏనుగమర్రి రాము, చల్లా అనుదీప్, కోండండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా కోట్రికే ఫణిరాజ్



డోన్, జనవరి 7: డోన్ పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కోట్రికే ఫణిరాజ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం ఆదివారం రాత్రి ప్రకటించింది. పార్టీ పట్టణ అధ్యక్షుడుగా 12 సంవత్సరాలపైనే పని చేశారు. అదే విధంగా రెండు సార్లు టీడీపీ నుంచి కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.

తైక్వాండోలో చిన్నారుల ప్రతిభ

బేతంచెర్ల, జనవరి 7: కర్నూలు నగరంలోని వెంకటేశ్వర కాలనీలో ఉన్న విజేత ఉన్నత పాఠశాలలో అమేచూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించారు. హయ్యర్ బెల్టు గ్రేడింగ్ టెస్టులో 50 మంది కరాటే విద్యార్థులు పాల్గొనగా.. అందులో బ్లూ బెల్ట్ దివ్యశ్రీ, బ్లూవన్ బెల్టుకు అమృత, సుచరిత, రుద్రతేజ, మణిశ్వని, రెడ్‌బెల్టుకు శ్రీవల్లి, జాకీర్, సాయిధరం తేజ, మనీషాలు ప్రతిభను కనబరిచారని ఇన్‌స్పెక్టర్ నాగన్న తెలిపారు. మేజర్ తైక్వాండో కార్యదర్శి వెంకటేశ్వర్లు ఉన్నారు.

పీసీసీ సభ్యుడిగా బాలు యాదవ్

కోవెలకుంట్ల, జనవరి 7: బనగానపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కన్వీనర్‌గా పనిచేస్తున్న బాలుయాదవ్‌ను కాంగ్రెస్ పార్టీ పీసీసీ సభ్యుడిగా నియమించింది. ఆదివారం బాలుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ తనపై నమ్మకంతో పీసీసీ సభ్యుడిగా చేసినందుకు నంద్యాల జిల్లా అధ్యక్షుడు జంగిటి లక్ష్మీనరసింహయాదవ్‌కు, జాతీయ పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు ఎంపిక

డోన్(రూరల్), జనవరి 7: సైన్స్ చెకుముకి టాలెంటు టెస్టు పరీక్షలో డోన్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మానిక్యం శెట్టి అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు. నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో డోన్ పట్టణం శ్రీసుధ స్కూల్‌కు చెందిన విద్యార్థులు మొదటి స్థాయిలో, జడ్పీ పాతపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారన్నారు. ఫిబ్రవరిలో విశాఖపట్టణంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని చెప్పారు. యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరు

● సమ్మె కొనసాగించిన అంగన్‌వాడీలు

● కార్మిక సంఘాల మద్దతు

బెదిరింపులతో ఉద్యమాన్ని ఆపలేరని అంగన్‌వాడీలు అన్నారు. వారు చేపట్టిన సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎస్మా చట్టాన్ని ప్రయోగించి బెదిరించడం సరికాదని ఆదివారం జీవో ప్రతులను కాల్చివేసి నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ డిమాండ్లను నెరవేర్చే దాకా సమ్మె ఆపబోమని స్పష్టం చేశారు. వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



దొర్నిపాడులో జీవో ప్రతులను తగలబెడతున్న అంగన్‌వాడీలు



ఆళ్లగడ్డలో..



రుద్రవరంలో జీవో ప్రతులను కాల్చివేస్తున్న అంగన్‌వాడీలు



డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల నిరసన



బనగానపల్లెలో..



సంజామలలో..



బేతంచెర్లలో గడ్డి తింటూ నిరసన



డోన్: సీఐటీయూ ఆధ్వర్యంలో చక్రం రూపంలో సెల్‌ఫోన్లను పెట్టి హోమం చేస్తూ నిరసన



కోవెలకుంట్ల: ఎస్మా చట్టం జీవో ప్రతులను కుందూనదిలో కలిపి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు



చాగలమర్రిలో



శిరివెళ్లలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



ఉయ్యాలవాడలో..

చంద్రబాబు సభను జయప్రదం చేయాలి: టీడీపీ



ఉయ్యాలవాడ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య



ఆళ్లగడ్డలో మాట్లాడుతున్న ఏవీ సుబ్బారెడ్డి



రుద్రవరంలో మాట్లాడుతున్న రాజారావు

ఉయ్యాలవాడ, జనవరి 7: ఈ నెల 9వ తేదీన ఆళ్లగడ్డలో జరిగే నారా చంద్రబాబు నాయుడు భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పిలుపుఇచ్చారు. ఆదివారం మండలంలోని తుడుమలదిన్నె, ఇంజేడు, ఉయ్యాలవాడ గ్రామాల్లో పర్యటించి టీడీపీ నాయకులను కలిశారు. పుల్లయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు అన్యాయం చేసిందన్నారు. ఉద్యోగాలు లేక యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అందువల్ల ప్రజల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కోవెలకుంట్ల మాజీ జడ్పీటీసీ గాండ్ల పుల్లయ్య, మైనారిటీ సెల్ నాయకుడు ఉశేన్‌వలి, టీడీపీ మండల నాయకులు పేరెడ్డి మోహన్‌రెడ్డి, గాండ్ల వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణంలో ఈ నెల 9న చంద్రబాబు సభను విజయవంతం చేయాలని టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి కోరారు. పట్టణంలోని ఆయన కళ్యాణ మండపంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగున్నర సంవత్సరాల పాలనలో బెదిరింపు రాజకీయాలు చేశారని ఆరోపించారు. వైసీపీ పాలనలో అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో చిన్నకందుకూరు మాజీ సర్పంచు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఆళ్లగడ్డలో ఈనెల 9వ తేదీన జరుగనున్న మాజీ సీఎం చంద్రబాబు సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి అఖిలప్రియ కోరారు. సభకు హజరయ్యే కార్యకర్తలకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

● చంద్రబాబు సభకు తాలుకాలోని గిరిజనులందరూ తరలి రావాలని రాష్ట్ర గిరిజన సంఘం ప్రచార కార్యదర్శి నరసింహులు పిలుపు నిచ్చారు. ఈ నెల 9వ తేదిన చంద్రబాబునాయుడు ఆళ్లగడ్డకు వస్తున్నారని, ఆయన పాలనలో గిరిజనులకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు.

ఆళ్లగడ్డ: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మంగళవారం ఆళ్లగడ్డ పట్టణానికి వస్తుండటంతో సభా వేదిక ఏర్పాట్లను ఆదివారం టీడీపీ నాయకుడు గోగిశెట్టి నరసింహారావు పరిశీలించారు. అలాగే టీడీపీ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రుద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు సభను విజయవంతం చేయాలని టీడీపీ ఎస్సీ సెల్ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం రుద్రవరంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న ఆళ్లగడ్డ పట్టణంలో రా.. కదలిరా.. సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు రామచంద్రుడు, అశోక్, సాగర్, దాను, బెనర్జీ, లూథర్‌బాబు, ఆకాశ్ పాల్గొన్నారు.

చాగలమర్రి టీడీపీతోనే ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం చాగలమర్రిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9న చంద్రబాబు ఆళ్లగడ్డకు వస్తున్న సందర్భంగా బీసీ కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

వైసీపీ పాలనలో నాపరాయి పరిశ్రమ నాశనం: బీసీ





కొలిమిగుండ్ల మండలంలోని బెలుం గ్రామం, బనగానపల్లెలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, ఇందిరమ్మ

కొలిమిగుండ్ల, జనవరి 7: నాపరాయి పరిశ్రమను వైసీపీ ప్రభుత్వం నాశనం చేసిందని, నాపరాయి యజమానులు నాశనం అవుతున్నా అసమర్థ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వారి సమస్యలు పట్టించుకోకుండా గాలికొదిలేశారని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం కొలిమిగుండ్ల మండలం బెలు గ్రామంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మేనిఫెస్టో గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేవారు. బీసీ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచడంతో గనుల యజమానులు గనులను మూసివేస్తున్నారన్నారు. బెలుం గ్రామంలో డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై మురుగు ప్రవహిస్తోందని, వైసీపీ నాయకులు, అధకారులకు కనిపించడం లేదా? అని బీసీ ప్రశ్నించారు. జగన్ పాలనలో నిరుద్యోగుల పరిస్థితి దారుణంగా తయారయిందన్నారు. జాబ్ క్యాలెండర్ ఇస్తామని వారిని మోసం చేశారన్నారు. గుడిసెగా ఉన్న రాయల్టీ చెక్‌పోస్టును, వైసీపీ అధికారం వచ్చిన తర్వాత రాయల్టీ చెక్‌పోస్టుకు బిల్డింగ్ నిర్మించి రాయల్టీ అధికంగా వసూలు చేస్తూ నాపరాయి పరిశ్రమను ఎమ్మెల్యే కాటసానితో పాటు, జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి సంక్షోభంలోకి నెట్టివేశారని విమర్శించారు. టీడీపీ నాయకులు రఘురామిరెడ్డి, బంగి హుసేనయ్య, అహమ్మద్, వి.మహేశ్వరరెడ్డి, రమేశ్, మూలే రామేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నంద్యాల రామేశ్వరరెడ్డి, శివరామిరెడ్డి, టీడీపీ, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

బనగానపల్లె: టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాలు ఇచ్చి తీరి వారికి గృహాలు మంజూరు చేయిస్తామని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని కొండపేట, నాయక్‌వాడీ వీధి, ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సయ్యద్‌హుసేన్ నియాజి, అన్వర్‌సాహెబ్, రోషన్ అహమ్మద్ హుసేన్, మహబూబ్‌బాషా, జాఫర్, ఖాజ, భాస్కర్, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

దీక్ష విరమణ



చౌడేశ్వరీమాత ఆలయానికి ఇరుముడితో వెళ్తున్న భక్తులు

బనగానపల్లె, జనవరి 7: మండలంలోని నందవరం చౌడేశ్వరీమాత ఆలయంలో ఆదివారం చౌడేశ్వరీమాత దీక్ష చేపట్టిన భక్తులు దీక్షను విరమిం చారు. ఆలయంలో నిర్వహించిన చండీహోమం ఆలయ ఈవో రామానుజన్, ఆధ్వర్యంలో, రుత్వికుల సమక్షంలో నిర్వహించిన చండీహోమం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగిసింది. అనంతరం చండీహోమంలో భాగంగా నిర్వహించిన పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. చౌడేశ్వరీమాతను దర్శించుకొని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. నందవరం గ్రామ వీధుల్లో మహిళలతో నిర్వహించిన కోలాటం అలరించింది. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

వృద్ధుడి నేత్రాలు దానం



నేత్రాలు దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

బేతంచెర్ల, జనవరి 7: బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన వృద్ధుడు సుబ్బారావు (80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వృద్ధుడి నేత్రాలు మట్టిపాలు కాకుండా నేత్రదానం చేయాలని ఆయన భార్య పుష్పలతను లైఫ్ యువనేత్ర సభ్యులు కోరగా నేత్రదానం చేసేందుకు ఆమె అంగీకరించారు. లైఫ్ యువనేతల సభ్యులు కర్నూలు రెడ్‌క్రాస్ బ్యాంకుకు సమాచారం ఇచ్చారు. ఐ బ్యాంకు టెక్నీషియన్ నాగన్న నేత్రాలను సేకరించారు. నేత్రదానం చేసిన మృతుని కుటుంబ సభ్యులకు లైఫ్ యువనేత్ర సభ్యులు రంగారెడ్డి, హరికృష్ణ, విజయ్ కృతజ్ఞతలు తెలిపారు.

'డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి'

డోన్(రూరల్), జనవరి 7: రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజయవాడలో పెద్ద ఎత్తున నిరుద్యోగులతో ఆందోళన చేస్తున్నట్లు తెలిపారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన



ఆళ్లగడ్డలో సమ్మె



డోన్‌లో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

డోన్(రూరల్), జనవరి 7: ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పాతబస్టాండు సర్కిల్‌లో మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేస్తూ తమ నిరసనను తెలియజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● సీఐటీయూ ఆధ్వర్యంలో దేవుళ్లను మొక్కుతూ మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన దీక్ష చేపట్టారు. సీపీఎం, సీఐటీయూ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆదివారం మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్యాట్యుటీ, పెన్షన్ ఇవ్వాలన్నారు.

'ఎస్మా చట్టం ప్రయోగాన్ని ఉపసంహరించుకోవాలి'

ప్యాపిలి, జనవరి 7: అంగనవాడీ ఉపాధ్యాయులు, ఆయాలపై ఎస్మా చట్టాన్ని ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శాంతిప్రియా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయులు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గత మూడేళ్లుగా తమ సమస్యలను పరిష్కరించాలని అంగనవాడీ వర్కర్లు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకొనకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లతీఫ్, నరసింహారెడ్డి, సర్వజ్ఞమూర్తి తదితరులు పాల్గొన్నారు.